క్లుప్తంగా

మెదక్ టికెట్‌కు దరఖాస్తు



దరఖాస్తు అందజేసిన శంకర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): మెదక్ బీజేపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీచేయడానికి తనకు అవకాశం కల్పించాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు శంకర్‌గౌడ్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థుల మానవహారం



మానవహారం నిర్మించిన విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం రెవెన్యూ డివిజన్ సాధన జేఏసీ ఆధ్వర్యంలో చిల్వెర ఐబీ చౌరస్తాలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 14వ రోజుకు చేరుకున్నాయి. అల్లాదుర్గంను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని విద్యార్థులు తరగతులు బహిష్కరించి అల్లాదుర్గం బస్టాండ్‌లో మానవహారం నిర్మించి తమ ఆకాంక్ష తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాల, సబ్ ట్రెజరీ కార్యాలయాలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బ్రహ్మం, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రామాయంపేట(మెదక్): జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన రామాయంపేటకు చెందిన రాజేందర్ నాయక్‌ను శుక్రవారం తెలంగాణ బంజారా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రామాయంపేటలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు విఠల్ నాయక్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఉమ్లానాయక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, రెడ్యానాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని కాయిదంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాంజ్యానాయక్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు. శుక్రవారం ఆయనను సర్పంచ్ భేతయ్య, స్థానికులు, విద్యార్థులు సన్మానించారు.

ఏబీవీపీ దిష్టిబొమ్మ దహనం



ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెదక్ కలెక్టరేట్: విద్యారంగ సమస్యలపై పోరాటం చేయలేక, పోరాడేవారిపై భౌతిక దాడులకు పాల్పడటం దారుణమని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. శుక్రవారం మెదక్ కొత్త బస్టాండ్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏబీవీపీ నాయకుల దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిపై దాడచేయడం హేయమైన చర్య అన్నారు. ఏబీవీపీ దాడికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

108 సేవలు భేష్

తూప్రాన్: మండలానికి నూతనంగా కేటాయించిన 108, 102 వాహనాలను ఈఎంఆర్ఐ సంస్థల మేనేజర్ వసంత్, జిల్లా అధికారి మహేష్ కుమార్, ఎఫ్‌సీ తిరుపతి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది పనితీరు బాగుందని ప్రశంసించారు. సేవలను ఇదేవిధంగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ ఈఎంటి శ్రీనివాస్ పైలట్ శంకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

హవేళీఘనపూర్(మెదక్): ప్రమాదంలో గాయపడిన యువకులను సకాలంలో ఆస్పత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడిన రామాయంపేట మండలం బస్వాపూర్ సర్పంచ్‌ను స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల మెదక్ మండలం గుట్టకిందిపల్లి గ్రామానికి చెందిన యువకులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కార్యక్రమంలో గుట్టకిందిపల్లి గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహంకాళీ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

చేగుంట(తూప్రాన్): మహంకాళీ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను శనివారం నుంచి నిర్వహించనున్నట్లు సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఆహ్వానించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మాతా శిశు సంరక్షణకు సీఎం కృషి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



సర్టిఫికెట్లు అందజేస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

నర్సాపూర్: రాష్ట్రంలో మాతా శిశువుల సంరక్షణకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, అందులో భాగంగా పలు పథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేస్తున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో శిక్షణ పొందిన యువతులకు సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. నీ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబరు మాసాన్ని పోషణమాసంగా నిర్వహిస్తున్నారన్నారు. పోషక ఆహారం, రక్త హీనత తదితర అంశాలపై గర్భిణులు, మహిళలకు, కిషోర బాలికలకు అవగాహన కల్పించేందుకు పోషణమాసంలో ఐసీడీఎస్ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడతారని చెప్పారు. రక్తహీనత నుంచి గర్భిణులను కాపాడేందుకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా ఆరోగ్యలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించి మాతా శిశువుల మరణాల రేటును తగ్గించేందుకు సీఎం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని చెప్పారు. కాగా బాలికలు, యువతులకు కుట్టు మిషన్ శిక్షణ, బ్యూటీషియన్ తదితర అంశాలలో శిక్షణ ఇచ్చారని, త్వరలో కంప్యూటర్‌లో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. అనంతరం బ్యూటీషియన్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సరళకుమారి, సుజాత, సుల్తానా, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, మహ్మద్, షేక్ హుస్సేన్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా సంగారెడ్డిలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం సహకారంతో యువతులకు బ్యూటీషియన్ శిక్షణ ఇచ్చినట్లు సూపర్ వైజర్లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పాతూర్‌లో పోషణ మాసంలో పాల్గొన్న మహిళలు

హవేళీఘనపూర్(మెదక్): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని మెదక్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమృత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాతూర్ గ్రామంలో అంగన్‌వాడీ-2లో పోషణమాసం ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



బొడ్మట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ..

టేక్మాల్(మెదక్): పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని బొడ్మట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కలాలి స్వరూప మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, డాక్టర్ శ్యామల, ఏఎన్ఎం జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని..



అజ్జమర్రి నుంచి కొమురవెల్లికి బయలుదేరిన గ్రామస్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి టికెట్ రావాలని కోరుతూ మండలంలోని అజ్జమర్రి గ్రామస్తులు సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. శుక్రవారం గ్రామానికి చెందిన జనార్దన్, వీరేశం, నితిన్‌కుమార్ మొయినుద్దీన్ తదితరులు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు పర్యాయాలు మదన్‌రెడ్డి నియోజకవర్గానికి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఆయనకు మరోసారి టికెట్ రావాలని మొక్కుకొని కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టామన్నారు.

అడవి పంది దాడి: వ్యక్తికి గాయాలు



వివరాలు సేకరిస్తున్న అటవీ అధికారి రాము

నిజాంపేట(మెదక్): అడవి పంది దాడిలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేటకు చెందిన దండు కరుణాకర్ పొలం పనికి వెళ్లాడు. పొలంలో పని చేస్తుండగా అడవి పంది దాడి చేయడంతో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న అటవీ అధికారి రాము విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామన్నారని తెలిపారు.

కోర్టు తీర్పు అమలు చేయండి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రమైన వెల్దుర్తిలో సర్వే నంబర్ 2,332లో చేపడుతున్న దుకాణ సముదాయం పనులకు సంబంధించి హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలంటూ వెల్దుర్తికి చెందిన ఎస్ఆర్ఐ రవికుమార్ తల్లి వెంకటలక్ష్మి, కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వెల్దుర్తి పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి కోర్టు ఉత్తర్వుల ప్రతిని సెక్రటరీ బలరాంరెడ్డికి అందజేశారు. సర్వే నంబర్ 2,332లో చేపడుతున్న నిర్మాణాలకు సంబంధించి కన్వర్షన్ అనుమతులు రద్దు చేసి సర్వే చేపట్టాలని కోర్టు ఆదేశించినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పేదల ఆరోగ్య సంజీవని సీఎంఆర్‌ఎఫ్

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): అనారోగ్యంతో బాధపడే పేదలకు వైద్యఖర్చుల కోసం ప్రభుత్వం అందజేస్తున్న సీఎంఆర్‌ఎఫ్ వారికి ఆరోగ్య సంజీవని అని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతా రెడ్డి శుక్రవారం అన్నారు. గ్రామానికి చెందిన లూనావత్ సునీతకు ప్రభుత్వం వైద్యఖర్చుల కోసం చెక్కురూపంలో రూ.46 వేలు విడుదల చేసింది. ఈ చెక్కును లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేఘమాల, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, కిష్టాపూర్ సర్పంచ్ గోదావరి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి చేతుల మీదుగా..

తూప్రాన్: మండలంలోని నర్సంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.42,500 చెక్కు రూపంలో విడుదల చేసింది. ఈ చెక్కును ఆర్థిక, వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హైదరాబాద్‌లోని తన నివాసంలో లబ్ధిదారుకి అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ మంజూరుకు కృషి చేసిన బీఆర్ఎస్ నాయకుడు సిందే చంద్రంను మంత్రి అభినందించినట్లు స్థానిక నాయకులు తెలిపారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతా రెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత



నర్సాపూర్ కోర్టు ఆవరణలో మొక్కలను పంపిణీ చేస్తున్న జడ్జి కె.అనిత

నర్సాపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో మొక్కలు నాటి, అనంతరం సిబ్బందికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల పుట్టిన రోజున మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లను నరికితే చట్టరీత్యా శిక్షించబడతారన్నారు. శనివారం స్థానిక కోర్టులో మెగా లోక్ అదాలత్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎంపీపీ చింత స్వప్న



మాట్లాడుతున్న ఎంపీపీ, చిత్రంలో డీఎల్‌పీఓ రాజేంద్రప్రసాద్ తదితరులు

టేక్మాల్(మెదక్): గ్రామాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ చింత స్వప్న అన్నారు. వారం రోజులుగా ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. డీఎల్‌పీఓ రాజేందర్ ప్రసాద్ వారితో వేర్వేరుగా సమావేశమయ్యారు. విధుల్లో ఎంపీడీఓ, కార్యదర్శులు పరస్పరం సహకరించుకోవాలని, పరస్పర ఆరోపణలు సరికాదని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అందరూ సమష్టిగా పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు శ్వేతచంద్రశేఖర్‌రెడ్డి, టేక్మాల్ సర్పంచ్ సుప్రజాభాస్కర్, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక



మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌పాటిల్ తదితరులను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న దామోదర రాజనర్సింహ

రేగోడ్(మెదక్): అందోల్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ తెలిపారు. రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ రాజేందర్ పాటిల్, ఆయన తనయుడు ప్రదీప్ పాటిల్, వార్డు సభ్యుడు యాదగిరి తదితరులు శుక్రవారం గాంధీ భవన్‌లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారన్నారు. వీరికి దామోదర రాజనర్సింహ పార్టీ కండువ కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినట్లు చెప్పారు. పార్టీని బలోపేతం చేయాలని సూచించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, జెడ్పీటీసీ సభ్యుడు యాదగిరి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, ఆర్.ఇటిక్యాల పార్టీ అధ్యక్షుడు ఈశ్వరప్ప, మల్లేశం, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు



ధర్నా చేస్తున్న కార్మికులు

కౌడిపల్లి(నర్సాపూర్): కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని తునికివద్దగల శ్రీనివాస చికెన్ కంపెనీ వద్ద సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస చికెన్ పంపెనీ యాజమాన్యం కార్మిక చట్టాలకు విరుద్ధంగా కార్మికులతో పనిచేయిస్తోందన్నారు. జీఓ 33 ప్రకారం వేతనాలు ఇవ్వాల్సిఉన్నా తక్కువ వేతనాలు ఇస్తున్నరని ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పత్తి పంటల పరిశీలన



అల్లాదుర్గంలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ

కొల్చారం(నర్సాపూర్): భారీ వర్షాలు కురియడంతో పత్తి పంటను మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి పరిశీలించారు. శుక్రవారం ఎనగండ్ల, కోనాపూర్ గ్రామాల్లో పర్యటించారు. పత్తి మొక్క పెరుగుదల పరిశీలించి వాతావరణ పరిస్థితుల కారణంగా పంటను చీడపీడలు ఆశించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

పత్తిలో నీటిని తొలగించాలి

అల్లాదుర్గం(మెదక్): భారీ వర్షాలకు పత్తి పంటలో నిలిచిన నీటి తొలగించాలని మండల వ్యవసాయాధికారి రాజేశ్ రైతులకు సూచించారు. శుక్రవారం అల్లాదుర్గం రైతులు సాగుచేపట్టిన పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలతో పంటలు దెబ్బతింటాయని, పంటలను కాపాడుకునేందుకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మహేశ్, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఉచిత వైద్య శిబిరం**

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కుర్తివాడలో శుక్రవారం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమెరికా దేశానికి చెందిన వైద్యులు 135 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్రవంతి పాల్గొన్నారు.

◆ **ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన**



నర్సాపూర్: నర్సాపూర్‌లోని విష్ణు ఫార్మసి కాలేజీ ప్రొఫెసర్ వనిత తన భర్త దివంగత గంజి సుధీర్ బాబు జ్ఞాపకార్థం నర్సాపూర్ దివ్యాంగుల పునరావాస కేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు ముందుకు వచ్చారు. శుక్రవారం గంజి సుధీర్‌బాబు 50వ జయంతిని పురస్కరించుకుని ప్రహరీ నిర్మాణానికి శంకస్థాపన చేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్, సుధీర్ బాబు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **12న మండల సర్వసభ్య సమావేశం**

హవేళీఘనపూర్: ఈనెల 12వ తేదీ ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రశాంత్ శుక్రవారం తెలిపారు. మెదక్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ యమున జయరాంరెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలన్నారు.

◆ **ఆర్థిక సాయం**

నిజాంపేట(మెదక్): అనారోగ్యంతో మృతి చెందిన మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి బీఆర్ఎస్ నాయకుల ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన మావురం నాగరాజు(45) అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాయకుల ద్వారా కొంత నగదు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, యూత్ అధ్యక్షుడు మావురం రాజు, మాజీ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

◆ **కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి**

చిన్నశంకరంపేట: సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని టీపీటీఎఫ్ చిన్నశంకరంపేట మండల అధ్యక్ష కార్యదర్శులు రమేశ్‌చారి, వేణుగోపాల్‌చారి డిమాండ్ చేశారు. పీటీఐ, సీఆర్‌పీ, ఎంఎస్ఐ, ఈఆర్పీఐ, కేజీబీవీ తదితర కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగులకు వేతనాలు సరిపోక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

◆ **ఈవీఎంలపై అవగాహన**



రేగోడ్(మెదక్): మండలంలోని టి.లింగంపల్లి గ్రామంలో శుక్రవారం ఎన్నికల్లో ఈవీఎంను ఎలా వినియోగించాలో ఆర్ఐ ఫిరోజ్ శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.

◆ **అభివృద్ధిలో వెనుకబడింది**

అల్లాదుర్గం(మెదక్): అభివృద్ధిలో అందోల్ నియోజక వర్గం వెనుకబడిందని బీఎస్పీ అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పారం ప్రకాశం అన్నారు. శుక్రవారం మండలంలోని అప్పాజిపల్లి గ్రామంలో బీఎస్పీ పార్టీలోకి పలువురు చేరారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నినాదంతో ఎమ్మెల్యేగా గెలిచిన క్రాంతికిరణ్ నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **మృతుడి కుటుంబానికి పరామర్శ**

కౌడిపల్లి(నర్సాపూర్): అప్పుల బాధతో ఇటీవల మండలంలోని ముట్రాజ్‌పల్లిలో తలారి వీరేశం ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. మృతుడి అన్న నాగేశ్‌ను వివరాలు అడిగి తెలుసుకొని కొంత ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, మాజీ ఉపాధ్యక్షుడు సున్నం సతీష్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సార రామాగౌడ్, యూత్ అధ్యక్షుడు కృష్ణగౌడ్, ఉపసర్పంచ్ వెంకటేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **మద్యం మత్తులో ఇరువర్గాల ఘర్షణ**

నర్సాపూర్: మద్యం మత్తులో ఘర్షణ పడి పరస్పరం దాడి చేసుకున్న సంఘటన గురువారం రాత్రి జరిగింది. శుక్రవారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్‌కు చెందిన వడ్డెర రమేశ్, కుమార్, నవీన్ వైన్‌షాపు వద్ద మద్యం తాగారు. అదే సమయంలో శివ్వంపేట మండలం కొత్తపేటకు చెందిన గిరిజనులు శ్రీను, సాగర్, కిషన్ కూడా అదే షాపులో మద్యం తాగారు. తాగిన మత్తులో మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గురువారం రాత్రి వడ్డెర రమేశ్, శుక్రవారం గిరిజన శ్రీను ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ **విద్యార్థులకు రైటింగ్ కిట్ అందజేత**

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని బీఆర్ఎస్ నాయకుడు యాసిన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గౌతాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెన్నులు, పెన్సిల్స్ తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **సంతోషిమాత ఆలయంలో పూజలు**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలోని సంతోషిమాత ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శించుకుని, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి దేవాదత్తశర్మ అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

◆ **నర్సాపూర్ టికెట్ స్థానికులకే ఇవ్వాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ టికెట్ స్థానిక నాయకుడు ఆవుల రాజిరెడ్డికి ఇవ్వాలని కౌడిపల్లి మాజీ ఎంపీపీ గండి యాదాగౌడ్ శుక్రవారం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఆయన కృషి చేస్తున్నాడన్నారు. గాలి అనిల్‌కుమార్ నర్సాపూర్ టికెట్ కోసం ప్రయత్నిస్తుండటం సరికాదన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తల అభీష్టంమేరకు స్థానికులకు మాత్రమే టికెట్ ఇవ్వాలన్నారు.

◆ **ఆ కుటుంబానికి న్యాయం చేయాలి**

పెద్దశంకరంపేట(మెదక్): హోంగార్డు రవీందర్ కుటుంబానికి న్యాయం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తనకు రావాల్సిన జీతం కోసం రవీందర్ మూడు రోజుల క్రితం ఉన్నతాధికారులను కోరారని, వారు అవమానించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. రవీందర్ మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని అతడి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు శ్రావణ్ కుమార్, సాయిలు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

◆ **విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన**

తూప్రాన్: పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ హాజరయ్యారు.

◆ **వాల్ పోస్టర్ ఆవిష్కరణ**

సెప్టెంబర్ 10వ తేదీన నిర్వహించే బీసీల సింహగర్జన సభ వాల్ పోస్టర్‌ను జిల్లా బీసీ సంక్షేమ సంఘం, బీసీ విద్యార్థి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడుతూ 'హలో బీసీ-చలో సరూర్ నగర్ గ్రౌండ్' సభను విజయ వంతం చేసేందుకు బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. 'సామాజిక న్యాయం, సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలంటే 'బీసీల సింహగర్జన' సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు, బీసీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు గ్లాసుల పంపిణీ**

మండలంలోని అల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం స్టీల్ గ్లాసుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ భారతి కోడె ఆదేశాల మేరకు విద్యార్థులకు 65 స్టీల్ గ్లాస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎమ్మార్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధులు లక్ష్మణ్ రావు, ప్రవీణ్ చరణ్ కుమార్, ఉపాధ్యాయులు సంధ్యారాణి, పద్మావతి, ఫౌండేషన్ వలంటీర్స్ పాల్గొన్నారు.

◆ **వెల్మకన్నలో శావ ఊరేగింపు**

కౌడిపల్లి(నర్సాపూర్): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మండలంలోని వెల్మకన్నలో ఘనంగా జరిగాయి. గురువారం రాత్రి శ్రీరాయగిరి వెంకటేశ్వర స్వామి ఆలయం భక్త భజన మండలి ఆధ్వర్యంలో గ్రామంలో శావ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.